

# పవిత్ర హృదయం

రచన: డాక్టర్ డి. సూర్యభగవాన్.

అది బ్రహ్మాండమైన జైలు.

అందులో ఎటు జూచినా ఆకాశాన్నంటుతునే ప్రహరీలు ఖైదీలను యితర ప్రపంచంతో ఏలాంటి సంబంధం లేకుండా వేరు చేస్తున్నాయి, ఆ గోడలమీద ఏదో వ్రాసివుండడం గమనించాడు మన కథా నాయకుడు.

అదేమిటో చూడాలనిపించింది ఆ నాయకునికి. కానీ, ఒక వంక తన ప్రాణాలమీది తీపి అతన్ని ఆ వైపు చూడనీయకపోయినా - తెల్లవారితే ఉరికంబం ఎక్కాలి గదా అన్న భయంకరమైన ఘోరమైన భావం మనస్సును, మనస్సుతో పాటు శరీరాన్ని ఛేదించివేస్తున్నా ఆ అక్షరాల్లో ఇమిడివున్న పరమార్థం ఏమిటో గమనించాలి అని బుద్ధి పుట్టింది ఆ వ్యక్తికి!

ధీరోదాత్తుడు అతడు. ఆ అక్షరాలు తన్ను పిలుస్తున్నట్లనిపించింది అతని మనసుకు. కండ్లు రెండూ ఆ అక్షరాలని వీడి బయట పడడం లేదు.

ఆ అక్షరాలను సమీపించాడు మెల్ల మెల్లగా. ఆ అక్షరాలను మిటమిట్లు గొలిపే ఆ బంగారం ఎంతగా ఆకర్షించిందో అతన్ని కనురెప్పలు రెండూ విశాలంగా విప్పి చూశాడు.

అతను తన కండ్లను తాను నమ్మలేక పోయాడు. ఈ బందిఖానాలోనే నా యింతటి పవిత్రమైన వాక్యాలు. ఆహా! అంటూ తల వూపేడు. ఊపిన తల ఆపి ఒక్కమాటు హృదయపూర్వకంగా యిలా చదివేడు :

'నాయనా! నీ జన్మలో ఎవరికీ ఏలాంటి అపకారమూ చేయకు. అందువలన నీకు హాయి కలుగదు గదా యితరులకు కూడా అంతే.' ఈ వాక్యాలు చదివాడో లేదో ఒక్కమాటుగా అతని కండ్లలో నీరు గిర్రు మన్నాయి.

తన జీవితంలో తాను జేసిన నేరపు ఘట్టాలు, హంతక ఘట్టాలు అన్నీ తన కండ్ల ఎదుట సినిమాలా కనిపింపసాగేయి. ఆహా! ఇంతవరకు అపకారం జేశాను గదా! ఎవరికీ చింతాకంత ఉపకారం చేయలేదు కదా! అని తలంచుకుంటూ కన్నీటి బిందువులతో ఆ గోడని తడిపి వేరొక దిక్కుగా తిరిగి కూర్చున్నాడు.

ఆ గోడ మీద చెక్కివున్న అక్షరాలను జూచి మరీ దుఃఖంలో మునిగిపోయాడు.

అశ్రుజలాలు నదులై ప్రవహించినా ఖర్మ విధి తప్పదుగా!

'ప్రపంచంలో నిజంగా తప్పనిసరి అని చెప్పుకోదగింది ఒక మృత్యువే సుమా! దానిని తరించడానికి ప్రయత్నం చేయడమే మోక్షం కాబట్టి నీవు నీ మృత్యువును జయించడానికి చూడు. పాపం చేయకుండా నీ మనస్సును శరీరాన్ని దివ్యంగా-పవిత్రంగా వుంచుకో.' అని మరోమాట చదివేడు.

జ్ఞానదీపం మన మానవత్వంలో వున్న అజ్ఞాన తమస్సును పరిహరించి-చైతన్య శక్తిని మేల్కొల్పుతుంది.

బరువెక్కిన గుండెతో అతను వెనుదిరిగి తనగది చేరుకున్నాడు.

× × ×

తెల్లవారింది!

అధికారులు అతన్ని వురికంబ మెక్కించడానికి తీసికొని పోయారు. అతని చూపుల్లో, నడకలో, మొహంలో కల్గిన మార్పును సంతోష చిహ్నలను జూచి అందరూ ఆశ్చర్య పోయారు. అయినా న్యాయమూర్తి శిక్షకు మాటకు-బదులాడడం ఎలాగ? ఉరికంబ మెక్కించారు.

అది కాలపురుషుని చిద్విలాసం!

ఇంతలో జవాను చిట్టాపట్టుకొని వచ్చాడు.

'అగు - అగు' అన్న గంభీర స్వరంతో న్యాయమూర్తి ఉరిశిక్షను రద్దు చేశారు. అంటూ చిట్టా చూపించాడు.

అదీ హృదయ పవిత్రతకు నిదర్శనం అంటూ జైలు గోడలు మారు మ్రోగాయి.

'మానవుని పుట్టించేశక్తి మానవునకు లేనట్లే మానవుని చంపే శక్తి కూడా మానవునకు లేదు విధి విలాసం! అంటూ చిరునవ్వుల్తో ఎదుటనున్న మహాత్మాగాంధీ చిత్రం కళ కళలాడిపోయింది.

ఆరోజంతా అజ్జైలు సమస్తమూ ప్రశాంత ఆశ్రమంగా మారిపోయింది.

మబ్బుతునకలు తొలగిన శరదాకాశం అతి నిర్మలంగా వుంది.

మానవులు అపవిత్రాత్మలో ప్రశాంతంగా బ్రతకలేరు కదా!

పంకంలో బుట్టినా పద్మం పూజార్హమే కదూ!



నాణ్యమునకు ప్రసిద్ధిచెందినది "గీతా మార్కు" చేనేత వస్త్రములు.

మీరు బట్టలను ఖరీదు చేయునప్పుడు వాటి మీద "గీతా మార్కు" గమనించ ప్రార్థన.

గీతా అండు కంపెని

జవుళి వ్యాపారం : : ఈరోడు.